క్లుప్తంగా

విద్యార్థులకు మాక్ పోలింగ్



సిరా గుర్తు చూపిస్తున్న విద్యార్థినులు

సిద్దిపేటఅర్బన్: ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సోమవారం బక్రిచెప్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్, షెడ్యూల్ విడుదల, నామినేషన్ పత్రాల స్వీకరణ, ఉపసంహరణపై గురించి వివరించారు. పోలింగ్ ప్రధాన అధికారిగా హెచ్ఎం నాగేందర్‌రెడ్డి, రిటర్నింగ్ అధికారిగా పూర్ణచందర్‌రావు, ప్రిసైడింగ్ అధికారిగా నందిని, సిబ్బంది, ఏజెంట్లుగా 9వ తరగతి విద్యార్థులు వ్యవహరించారు.

ఇంటింటికీ ఇంకుడు గుంత



నాగారంలో తవ్విన ఇంకుడు గుంత

హుస్నాబాద్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంకుడు గుంతలు నిర్మించనున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మించాలనే లక్ష్యంతో ఉపాధిహామీ పథకంలో నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. మండలంలో 310 ఇళ్లు మంజూరుకాగా నిర్మాణ పనులు వేగవంతం చేసినవారికి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందని చెప్పారు. ఎంపీఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'రూమ్ టు రీడ్'



మాట్లాడుతున్న ఎంఈఓ రమేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించడానికి రూమ్ టు రీడ్ దోహదపడుతుందని మండల విద్యాధికారి రమేశ్ అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించిన విద్యార్థుల సామూహిక పఠనా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమాలను ప్రతి హెచ్ఎం తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటుచేసి విద్యార్థులకు ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని సూచించారు. హెచ్ఎంలు మంజుల, కరుణశ్రీ, సత్యనారాయణ, శ్రీనివాస్, బాలరాణి, తిరుపతయ్య, అర్పిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని నూతనంగా ఏర్పాటైన సేవాలాల్ మహారాజ్‌తండా పంచాయతీ నూతన భవన నిర్మాణానికి సోమవారం ఎంపీఓ గుగులోతు మోహన్ నాయక్, పీఆర్ ఏఈ భిక్షపతి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ ఈ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరగా పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

డెస్కులు అందజేత



నాచారం స్కూల్‌కు అందజేసిన డెస్కులు

వర్గల్(గజ్వేల్): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సోమవారం వర్గల్ మండలం నాచారం జెడ్పీ హైస్కూల్‌కు మేడ్చల్ ఐడీబీఐ బ్యాంక్ అధికారులు రూ.76 వేల విలువైన డ్యూయల్ డెస్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆ బ్యాంక్ ఏజీఎం సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమారాణి, బ్రాంచ్ మేనేజర్ శ్రీధర్, మొహసీన్, ప్రశాంత్, కరుణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వైకుంఠానికి' దారేది?

అడ్డంకిగా అసంపూర్తి కల్వర్టు
- వాగు పారితే రాకపోకలు బంద్
- చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే..
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు

నంగునూరు(సిద్దిపేట): గ్రామస్తులు, రైతుల సౌకర్యార్థం నిర్మించిన కల్వర్టు అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఆ దారి గుండా వెళ్లే స్థానికులు, రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే రాకపోకలు బంద్ కావడంతో చుట్టూ తిరిగి వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సివస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలుగు పారితే అంతే..

గ్రామానికి మంజూరైన శ్మశాన వాటికను కూడా అదే మార్గంలో నిర్మించారు. దీంతో వర్షాకాలంలో అలుగు పారితే అంత్యక్రియలకు వెళ్లేందుకు తిప్పలు తప్పడం లేదు. అలాగే ఉన్న రోడ్డు ఎగుడు, దిగుడుగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా పట్టించుకునే వారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు.



అసంపూర్తిగా ఉన్న కల్వర్టు నిర్మాణం

జెడ్పీ నిధుల మంజూరు

గ్రామం నుంచి రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే ఆ మట్టిరోడ్డు గుండా వెళ్లాల్సిన పరిస్థితి. వర్షాకాలంలో ఊర చెరువు మత్తడి దూకడంతో పాటు ఓర్రెల నుంచి వచ్చే నీటితో కొన్ని రోజుల వరకు నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. దీంతో రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఈ విషయాన్ని అప్పటి మంత్రి హరీశ్‌రావుకు వివరించడంతో ఆయన కృషితో జెడ్పీ నిధుల నుంచి రూ.12 లక్షలు మంజూరుకాగా కల్వర్టు నిర్మించారు. దీనికి అప్రాన్ నిర్మించాలని, అలాగే రెండు వైపులా మట్టిపోసి రోలింగ్ చేస్తే వినియోగంలోకి వస్తుంది. త్వరగా పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.



శ్మశానానికి వెళ్లే దారిలో ప్రవహిస్తున్న నీరు

ఇబ్బందులు పడుతున్నాం..

గ్రామ శివారులో ఉన్న స్మశానవాటికకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో చెరువు మత్తడి దూకడంతో మోకాళ్లలోతున నీరు ప్రవహిస్తుంది. కల్వర్టు నిర్మాణం పూర్తికాకపోవడంతో డబ్బులు పోగుచేసి మట్టి పోయించాం. వర్షాలకు ఆ మట్టి కొట్టుకొని పోయింది. - సుంచు మహేశ్, గ్రామస్తుడు, బద్దిపడగ



ఉన్నతాధికారులకు నివేదిస్తాం

నిధుల మంజూరైన మేరకు పనులు జరిగాయి. అసంపూర్తిగా ఉన్న కల్వర్టుతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు మా దృష్టికి తీసుకువచ్చారు. తాత్కాలికంగా మరమ్మతులు చేయించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - బ్రహ్మం, పంచాయతీరాజ్ డీప్యూటీ ఈఈ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం విజయ్‌కుమార్‌తో కలిసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భావితరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సీఐ వాసుదేవరావు, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

చట్టాలపై అవగాహన అవసరం

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కొమురవెల్లి ఎస్ఐ లింగంపల్లి రాజుగౌడ్ సూచించారు. మండల పరిధిలోని నాగపురి ఉన్నత పాఠశాలలో చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్‌టచ్, బాడ్‌టచ్, గంజాయి లాంటి మత్తుపదార్థాలు, ఈవ్ టీజింగ్‌పై కొమురవెల్లి పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే షీ టీం 87126 67434కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. హెచ్ఎం ఐలయ్య, షీ టీం సభ్యులు సదయ్య, ప్రశాంతి, స్వప్న, కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుకు ప్రాధాన్యమివ్వాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చదువు, సమయానికి తగిన ప్రాధాన్యమివ్వాలని టూటౌన్ సీఐ ఉపేందర్ సూచించారు. దీక్ష అకాడమీలో విద్యార్థినులకు సోమవారం సైబర్ నేరాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పించారు. అపరిచితుల మాటలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

దుబ్బాకటౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణిస్తే అనతి కాలంలోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని రాయపోల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అన్నారు. రాయపోల్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ అజాగౌడ్, భూంపల్లి ఎస్ఐ హరీశ్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఖాజీపూర్‌లో నియోజకవర్గ స్థాయి సబ్ జూనియర్ బాలికల వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. టీపీసీసీ సోమేశ్వర్‌రెడ్డి, నాయకులు శ్రీధర్, మధు, సుధాకర్‌రెడ్డి, రాందాస్ గౌడ్, చిరంజీవి, నాగరాజు పాల్గొన్నారు.



మిరుదొడ్డి: కప్పు అందుకొంటున్న బాలికల జట్టు

స్కావెంజర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

సీఐటీయూ జిల్లా నేత రవికుమార్

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు ఏడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేసేందుకు పది నెలలకుగాను స్కావెంజర్లను నియమించారన్నారు. కాని వారికి ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాక వారితో అదనంగా అటెండర్ పనులు కూడా చేయిస్తున్నారని వాపోయారు. వారికి ప్రతినెలా రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం అందించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఎల్కల్ గ్రామానికి చెందిన 27 మంది వితంతువులకు పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్కావెంజర్లు రజిత, కవిత, లక్ష్మి, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న స్కావెంజర్లు, సీఐటీయూ నాయకులు

పాఠశాలల్లో ఉత్సాహంగా పఠనోత్సవం



మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులతో పఠనం చేయిస్తున్న ఉపాధ్యాయులు



దుబ్బాకటౌన్: విద్యార్థులకు కథలు బోధిస్తున్న ఎంఈఓ సత్యనారాయణరెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక)/దుబ్బాకటౌన్/చేర్యాల(సిద్దిపేట): విద్యార్థుల్లో పఠనాసక్తి, అభిరుచి పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష, రూం టు రీడ్ ఇండియా ట్రస్ట్ సహకారంతో 15 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి ఉదయం 11 నుంచి అర గంటపాటు పఠన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అదేవిధంగా చేర్యాల మండల పరిధిలోని కడవేర్గు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పఠనోత్సవం నిర్వహించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులతో పాఠ్యపుస్తకాలతోపాటు, కథలు, వార పత్రికలు, బాల భారతం వంటి మ్యాగజైన్లను చదివించారు. మిరుదొడ్డిలో హెచ్ఎం కిషన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాలకృష్ణ, రాజేశ్వరి, ఇందిర, విద్యావాలంటీర్లు సరిత, నవిత తదితరులు పాల్గొన్నారు. అలాగే రాయపోల్ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమం వల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందుతుందన్నారు. రూమ్ టూ రీడింగ్ మండల కోఆర్డినేటర్ భవాని పాల్గొన్నారు. కడవేర్గు ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజమణి మాట్లాడుతూ 'రూమ్ టు రీడ్' అనే స్వచ్ఛంద సంస్థ 15వ తేదీ వరకు 'రీడ్ ఏ థాన్' నిర్వహిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు కాంతికృష్ణ, రమేశ్, చంద్రశేఖర్‌రావు, కృష్ణమూర్తి, సాజిదా, అరుణ, ప్రీతి, సీఆర్‌పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.కె.ప్రణీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్ పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సులలో 55 శాతం (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం) మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 3వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

మద్దూరు ఏపీఓగా మంజుల

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఏపీఓ, ఈసీగా విధులు నిర్వహించిన పరశురాములు ఏసీబీ అధికారులకు చిక్కిన విషయం తెలిసిందే. దీంతో చేర్యాల ఏపీఓ మంజులకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీఓ రామ్మోహన్ సోమవారం తెలిపారు. అలాగే సీనియర్ టీఏగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఈసీగా బాధ్యతలు తీసుకున్నారని వెల్లడించారు.

వినాయకుడికి విశేష పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన తొగుట శ్రీ హనుమాన్‌నగర్‌లో వినాయకునికి మహిళలు కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అలాగే గాంధీనగర్, బాలాజీ నగర్‌లలో వినాయకునికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



దుబ్బాకలో లక్ష్మీ గణపతి హోమం చేస్తున్న భక్తులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హరిహర రెసిడెన్సిలో..



తొగుటలో గణేశుడికి మహిళల కుంకుమార్చన



దుబ్బాక: వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసిన మండపం వద్ద అన్నదానం



దుబ్బాకరూరల్: అన్నదానంలో పాల్గొన్న ఎస్ఐ హరీశ్

కేసీఆర్‌పై బురదచల్లేందుకే..

- బీఆర్ఎస్ నాయకులు
- కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై నిరసనలు

కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టుపై అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇవ్వకుండా వ్యవహరించిన కాంగ్రెస్ విధానాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. ఆ పార్టీ నాయకులు సోమవారం జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు, సీఎం దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై బురదచల్లే ప్రయత్నాల్లో భాగంగానే ఘోష్ కమిషన్ తప్పుడు నివేదికలిచ్చిందన్నారు. గజ్వేల్‌లో వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కమిషన్ పేరుతో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రాన్ని గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌పై కాంగ్రెస్ కుట్రలు చేయడం తగదని టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆగ్రహించారు. ఆ పార్టీ శ్రేణులతో కలిసి మల్లన్న సాగర్ రిజర్వాయర్ వద్ద కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫ్లెక్సీకి జలాభిషేకం నిర్వహించారు.



గజ్వేల్‌లో రాజీవ్‌రహదారిపై వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో



చేర్యాల(సిద్దిపేట): రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తొగుట(దుబ్బాక): మల్లన్నసాగర్ వద్ద కేసీఆర్, హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి ఫ్లెక్సీకి జలాభిషేకం..



చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయకసాగర్ వద్ద గోదావరి జలాలతో బీఆర్ఎస్ నేతల నిరసన



మద్దూరు(హుస్నాబాద్): నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అక్కన్నపేట(హుస్నాబాద్): జనగామలో తెలంగాణ తల్లి విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **సీసీ కెమెరాల ప్రారంభం**

గజ్వేల్‌రూరల్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఏసీపీ నర్సింహులు అన్నారు. కొడకండ్ల గ్రామంలో సోమవారం 16 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఉన్నచోట నేరాలు చేయడానికి నేరస్తులు జంకుతారన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదం చేస్తున్నాయని చెప్పారు. తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **స్కూల్ బ్యాగుల అందజేత**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కొండాపూర్‌లో వంద మంది పేద విద్యార్థులకు సామాజిక సమరసత వేదిక, యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో సోమవారం స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో చేతన గ్రామ సమితి సభ్యులు పోచయ్య, సంతోష్‌కుమార్, కనకరాజు, శ్రీకాంత్, సాయికుమార్, మనోహర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కార్తీక్‌గౌడ్**



వర్గల్(గజ్వేల్): యూత్ కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా ఎర్రవల్లి కార్తీక్‌గౌడ్ నియమితులయ్యారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు.

◆ **మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు**

కోహెడ(హుస్నాబాద్): స్థానిక గురుకుల పాఠశాలలో బాలవికాస ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దానిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నిర్మల, జయరాజ్, తిరుపతిరెడ్డి, ధర్మయ్య, సుధాకర్, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **పేదల సంక్షేమానికి సీఎం కృషి**

తొగుట(దుబ్బాక): పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దేవునూరి పోశయ్య అన్నారు. మండలంలోని ఎల్లారెడ్డిపేటకు చెందిన దేవునూరి రాజుకు మంజూరైన రూ. 36 వేల సీఎం సహాయనిధి చెక్కును సోమవారం అందజేశారు. రవీందర్, యాదయ్య, ఫరీద్, శేఖర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలు దహనం**

చేర్యాల(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ బీజేపీ నాయకులు ఆయన దిష్టిబొమ్మలను సోమవారం దహనం చేశారు. చేర్యాల అంగడి బజారు వద్ద ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సంజీవులు, తిరుపతిరెడ్డి, గజ్వేల్‌లో ప్రజ్ఞాపూర్ మాజీ చైర్మన్ భాస్కర్, మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ కార్యక్రమాలు నిర్వహించారు. సురేశ్, మహేందర్‌రెడ్డి, రాందాసు, బాలరాజు, లింగం, సత్యవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా.. హైమాస్ట్ లైట్

తొగుట(దుబ్బాక): మండల కేంద్రమైన తొగుటలో ఓ హైమాస్ట్ లైటు స్థానికులను భయపెడుతోంది. స్తంభం నుంచి వేలాడుతూ దర్శనమిస్తోంది. నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే మండల కేంద్రంలో అది ఎప్పుడు ఊడి ఎవరిపై పడుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆ లైటును సరిచేయాలని ప్రజలు పలు మార్లు అధికారులకు విన్నవించినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నెలలు గడుస్తున్నా సరిచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఊడి పడటానికి సిద్ధంగా ఉన్న హైమాస్ట్ లైట్